శృంగారవీధి

# సేఫ్ సైడ్

శింగరాజు మాధవరావు

**వైదేహి పచ్చికొబ్బరిలా వుంటుంది.**

**వైకుంఠం ఎండునక్కలా వుంటాడు.**

**ఎండునక్క... పచ్చికొబ్బరి తింటుందో లేదోగాని వైకుంఠానికి చాలాకాలంగా వైదేహిని తినాలని వుంది.**

ఆ తినడంకూడా కసాబిసా నమిలిమింగేయడం కాదు, పాలచుక్కనేది లేకుండా పీల్చేసి... బుగ్గనున్న పిప్పిని బుర్రున బయటికూదేయడం!

"ప్రసాదాన్ని అలా ఊదడం మహాపాపం" అంటూ లెంపలేసుకుంటుంది పద్మావతి, గుడికెళ్లొచ్చిన ప్రతిసారీ.

పద్మావతి వైకుంఠం భార్య.

ఇప్పుడింట్లో లేదు. గుడికీ వెళ్లలేదు. రాత్రి తొమ్మిదవుతున్నా ఇంటికి రాలేదు.

వైకుంఠానికి పిచ్చిపట్టినట్లుంది.

భార్య రానందుకుకాదు. వైదేహి మళ్లీ కనిపించనందుకు.

వైదేహి బావుంటుంది. తన భార్యకంటే బావుంటుంది. ఈవిషయం ఆ కాంపౌండ్‌లోకి వైదేహి వచ్చిన తొలిరోజే కనిపెట్టేశాడు వైకుంఠం. ఆ మర్నాడే ఇంకో విషయంకూడా గ్రహించాడు. తనపేరులోనూ, వైదేహి పేరులోనూ మొదట 'వై' ఉండడం. ఆ మాత్రం ఆలోచనే అతడికెంతో ఆనందాన్నిచ్చింది.

ఇవి రెండూకాకుండా వైదేహి, వైకుంఠానికి విపరీతంగా నచ్చేయడానికి అసలు కారణాలు వేరేఉన్నాయి.

ఆడమనిషి అందమంతా నడుము కింద వెనుకవైపు, నడుముపైన ముందువైపు ఘనీభవించివుంటుందని వైకుంఠం నిశ్చితాభిప్రాయం. ఆ లెక్కన వైదేహిది పట్టుసడలని అందం. పెళ్లి కాలేదు. పాతికలోపు వుండొచ్చు. ఏదో ఉద్యోగం. ఒంటరిగావుంటోంది. వైకుంఠం చూపుకందే దూరంలో... ఎదుటి పోర్షన్‌లోనే.

ఇక చేతికందడమే మిగిలింది.

బయట చినుకులు.

ఇందాకనంగా స్నానంచేసి లోపలికెళ్లింది. వెళ్లేటప్పుడు చూశాడు... మెరుపు వెల్తుర్లో.

తడి ఒంటికి చుట్టుకున్న పొడి చీర... అక్కడక్కడా ఒంటిపార.

మతిపోయింది వైకుంఠానికి.

తేరుకునేలోపే-

మెరుపు... ఆకాశంలోకి. వైదేహి... ఇంట్లోకి.

తిట్టుకున్నాడు.

ఇంకా తిట్టుకుంటూనేవున్నాడు.

ఎంతకీ రాదేం? లోపలేంచేస్తోందో?

చీర కట్టుకుంటోందా?

నైటీ అయితే బావుంటుంది... ఆ పింక్ నైటీ... రెండు బటన్లూడాయి. ఆ మాత్రం విడుపు చాలు పొగరుగుండెలకు.

వర్షం పెద్దదయింది. కరెంటుపోతే బావుండుననుకున్నాడు వైకుంఠం. అది పోలేదుగానీ వైకుంఠానికే రెండోసారి మతిపోయింది.

వైదేహి బయటికొచ్చింది! తనకిష్టమయిన పింక్ నైటీ వేసుకునేవచ్చింది. నేరుగా వైకుంఠం దగ్గరికే వచ్చేసింది.

"చిన్న బర్నర్ వెలగడంలేదు. కాస్త వచ్చిచూడరూ... ఆఫీసునుంచి పద్మక్కింకా రాలేదా?"

ఆ చివరిమాట వినిపించుకోలేదు వైకుంఠం.

నేరుగా వైదేహి వంటింట్లోకి వెళ్లాడు. పక్కగా వచ్చి నిలుచుంది. సబ్బు పరిమళం గుప్పుమంది. లైటర్ అందుకుంటుండగా ఉరుము ఉరిమింది. వైదేహి ఉలిక్కిపడలేదు. కరెంటు పోయింది. వైకుంఠం గుండె ఆగిపోయింది. మెదడు పదునెక్కింది. చేతిని ఏ యాంగిల్లో ఎలా తిప్పితే ఏం తగులుతాయో ఊహిస్తున్నాడతను.

చీకట్లో గురిపెట్టి చెయ్యెత్తబోయాడు. ఆ లోపే కరెంటొచ్చేసింది. ఉసూరుమన్నాడు. చివరికి చిన్న బర్నరూ వెలిగింది.

"థాంక్సండీ! ఆకలి దంచేస్తోంది. రెండూ వెలిగిస్తే వంట త్వరగా అవుతుందనీ..."

"నాకూ దంచేస్తోంది. నిన్నుచూశాక ఇంకా... పైగాచలి. తనింకారాలేదు."

"నన్ను చూశాకా?"

"అదే... ఈ వంటా... ఘుమఘుమలూ..."

వైదేహి నవ్వింది.

"ఇంకా తాలింపు వెయ్యందే! అరే డబ్బా ఖాళీ!'

"తాలింపు గింజలేనా? నే వెళ్లి తెస్తానుండు."

"మీరా? ఇంత వర్షంలోనా?"

"ఏమంతపనీ? స్కూటరుందిగా!"

"ఇంట్లో లేవా?"

"మీ పద్మక్క ఎక్కడ పెట్టిందో. వెదికేలోపు నాలుగుసార్లు వెళ్లిరావచ్చు."

గడప దాటుతూ వెనక్కి తిరిగిచూశాడు వైకుంఠం.

వైదేహి స్టౌమీది గిన్నెలో గరిట తిప్పుతోంది. ఇంకో చెయ్యి నడుముమీద వేసుకుంది. నడుముకూ, చేతికీ మధ్య సెక్స్‌ట్రయాంగిల్!

ఆ త్రికోణంలోని వంపులకు బర్నర్ వెలుతురు షేడ్స్ ఇస్తోంది. నైటీలో గ్రహణం విడుస్తున్న జాబిల్లి!!

వైకుంఠం ఇంకోసారి ఉసూరుమన్నాడు.

వీధి మలుపు దగ్గరికొచ్చేసరికి వర్షంకాస్త తగ్గింది.

మెడికల్ షాపు ముందు స్కూటరాపాడు. లోనికెళ్లి చిన్న ప్యాకెట్ తెచ్చుకున్నాడు.

అతడికి వైదేహి గుర్తొచ్చింది. ఆమె పింక్ నైటీకూడా. చిన్నగా నవ్వుకున్నాడు. నవ్వుకుంటూ అనుకున్నాడు... ఈరోజు కాకపోతే రేపు. దగ్గరుంటే సేఫ్ సైడ్.

స్కూటర్ స్టార్ట్ చేశాడు.

ఎదురుగా కిరాణాషాపు చూసేవరకూ తాలింపు గింజలసంగతి గుర్తుకు రాలేదతనికి. దిగి వెళ్లబోతుండగా నెత్తిపై పిడుగు పడింది.

భార్య ఆఫీసు నుంచి వస్తోంది.

వైకుంఠానికి మండుకొచ్చింది. రానినవ్వు పులుముకున్నాడు. పద్మావతి దగ్గరకు రాగానే ఆందోళనగా ముఖం పెట్టాడు.

"ఎంత టెన్షనైందో తెలుసా? ఆఫీసులోవున్నావో... ఇంకెక్కడైనా హెల్డప్ అయ్యావో తెలీదు. ఫోన్‌చేస్తే రింగవుతుంది. ఎవరూఎత్తరు. వెళ్దాంకూర్చో. ముద్ద ముద్దయ్యావు. వెధవ్వర్షమొకటి. జలుబుచేస్తుందేమో, మందు తెస్తానుండు."

"అవసరం లేదులెండి. నాకు మీదే ఆలోచన. ఏవో అర్జెంటు ఫైల్సన్నారు. ఎనిమిదింటికి బయటపడ్డాను. తొమ్మిద్దాకా బస్టాప్‌లోనే. రెండో బస్సులో ఏదో టిక్కెట్ల గొడవ. అక్కడో అరగంట. సారీఅండీ. బాగా ఆకలేస్తోందికదూ?"

"ఇంకెక్కడి ఆకలీ? మనసంతా నీమీదే. మీ బస్టాప్‌కీ, ఇంటికీ తిరగడమే సరిపోయింది నాకు. ఇక ఉండబట్టలేక ఇదిగోపోలీస్ స్టేషన్‌కు బయలుదేరా."

హాయిగా నవ్వింది పద్మావతి. ఎవరూ చూడకుండా భర్తచేతిని ప్రేమగా నొక్కివదిలేసింది.



"నువ్వు లేకుండా ఇంట్లో ఒక్కక్షణమైనా గడపడం ఎంత నరకమో తెలిసొచ్చింది నాకు." ఇల్లు దగ్గరపడుతుండగా అన్నాడు వైకుంఠం.

తన ప్రేమను రెండోసారీ ఆపుకోలేకపోయింది పద్మావతి. ముక్కుతో భర్త వీపును పొడిచింది.

లోనికి రాగానే భార్యను అడిగాడు వైకుంఠం-"ఇంట్లో తాలింపు గింజలున్నాయా?"

"ఎందుకు?"

"వైదేహి అడిగింది. ఇచ్చి వెంటనే వచ్చేయ్. తనగురించి నీకో విషయం చెప్పాలి."

చిత్రంగా చూసింది పద్మావతి.

"తనగురించా?"

"ముందిచ్చిరా..."

అలా వెళ్లి ఇలా వచ్చేసింది పద్మావతి. రాగానే అంది-"మీకేదో శ్రమ ఇచ్చానంటుందేమిటీ...?"

"అదే నేనూ చెప్పాలంది. నీ గురించి ఆలోచిస్తూ నా కంగారులో నేనున్నానా... చిన్న హెల్ప్ చేయరూ అంటూ వచ్చింది. చెప్పమన్నా. తాలింపు గింజలు కావాలట! కాదనెలా అనేది? చివరికా విషయమే గుర్తులేదు . ఇప్పుడు నేనే తెచ్చాననుకున్నట్లుంది. ఎందుకైనా మంచిది, కాస్త జాగ్రత్తగా వుండాలి."

"జాగ్రత్తా? దేనికండీ?"

"తన చూపులు ఈ మధ్య అదోలా వుంటున్నాయి!"